క్లుప్తంగా

నాగలాపురం తహసీల్దార్‌గా ఎం.హనుమాన్



హనుమాన్ నాయక్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

నాగలాపురం: మండల నూతన తహసీల్దార్‌గా బుధవారం ఎం.హనుమాన్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నాగభూషణం, మహేష్, చంద్ర శేఖర్, సుధా, పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ ప్రాణాంతకం



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గుణశేఖర్

సత్యవేడు: దోమ కాటుతో వ్యాపించే మలేరియా, డెంగీ జ్వరాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చని దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ అన్నారు. బుధవారం కొత్తమారికుప్పం పంచాయతీలోని గిరిజన కాలనీలో సత్యవేడు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ ఆదేశాల మేరకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్య, వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కాచి చల్లార్చిన నీటిని తాగాలని, నివాస ప్రాంతాలు చుట్టు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలని సూచించారు. స్థానికులు సమస్యలు ఏవైనా ఉంటూ ఓ అర్జీరాసి కోర్టులో అందిస్తే న్యాయ సలహా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ, లాయర్ ఎం.వేలు, పంచాయతీ సెక్రటరీ హరీష్, వి.నాగజ్యోతి, ఏఎన్‌ఎం రోసిలిన్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించాలని వినతి



తిరుపతి అటవీశాఖ కార్యాలయం వద్ద ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

శ్రీకాళహస్తి: అటవీశాఖలో నాలుగునెలలుగా జీతాలు అందలేదని, వెంటనే ఇప్పించాలని ఫారెస్టు డిపార్ట్‌మెంట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా వారు తిరుపతిలోని అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్‌ఓను కలిసి సమస్యను విన్నవించారు. స్పందించిన ఆయన 12వ తేదీ లోపు నాలుగు నెలలు జీతాలు వచ్చేలా చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్తీక్, సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీలత

శ్రీకాళహస్తి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్రీలత సూచించారు. పట్టణంలోని కళాశాలలో బుధవారం యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్, యాంటీ టోబోకోపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ నేడు సమాజంలో యువత డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలకు బానిసై, జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది ప్రజ్ఞశ్రీ, అధ్యాపకులు నాగయ్య, తులసి, బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టార్టర్ల చోరీ



కోబాకలో పగులగొట్టిన స్టార్టర్

ఏర్పేడు: మండలంలోని కోబాక, ఏర్పేడు, పెద్ద అంజిమేడు గ్రామాల వ్యవసాయ పొలాల్లో మంగళవారం రాత్రి రైతుల స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ సరఫరా చేస్తుండడంతో రైతులు రాత్రిళ్లు పొలాల వద్దకు వెళ్లడంలేదు. ఇదేఅదనుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి వ్యవసాయ పొలాల్లోని 27 మంది రైతుల స్టార్టర్లను పగులగొట్టి అందులోని విలువైన కాపర్ వైరును అపహరించారు. బుధవారం పొలాల వద్దకు వెళ్లిన రైతులు స్టార్టర్లు లేకపోవడంతో ఆందోళన చెందారు. ఈ చోరీలపై ఎస్పీడీసీఎల్ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పిచికారీ.. ఆదమరిస్తే అపకారి



వరిపంటపై పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

పురుగు మందుల వాడకంతో పంటలకు లాభం మాటెలా ఉన్నా.. ఆ ద్రావణం పిచికారీ చేసే రైతు అజాగ్రత్తగా ఉంటే మాత్రం నష్టం తప్పదు. తెగుళ్లు, క్రిమికీటకాలకు వాడే రసాయనాలతో పలు అనర్థాలు సంభవిస్తున్నాయి. క్రిమి సంహారక మందు పిచికారీపై అవగాహన లేకపోతే అనారోగ్యం పాలైయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఏది ఏమైనా నిర్లక్ష్యం వహిస్తే, పిచికారీ రైతుకు అపకారిగా మారుతుంది.

- పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాంతకం

ఏర్పేడు: క్రిమి సంహారక మందుల వాడకంలో రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కొక్కసారి మరణాలు కూడా సంభవిస్తాయంటున్నారు. ఇలాంటి తరుణంలో ఎరువులు, మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రసాయనాలతో అనారోగ్య సమస్యలు

పంటలను ఆశించే చీడ, పీడల నివారణ కోసం రైతులు క్రిమిసంహారక మందులు వాడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పరోక్షంగా ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. కళ్లు తిరగడం, వాంతులు, క్యాన్సర్, గుండె జబ్బులు, నరాల బలహీనత లాంటి వాటికి లోనయ్యే ప్రమాదం ఉంది. పిచికారీ చేసే వ్యక్తులకే కాకుండా మందుల వాడకంతో వాటి అవశేషాలు పంటలపై చాలా కాలంగా ఉండి వాటిని వినియోగించే ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి గురవుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



పురుగు మందుల పిచికారీ సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుంది. ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి. మందు పిచికారి సమయంలో భోజనం చేయడం లాంటి చేయకూడదు. మందు పిచికారి చేసిన తరువాత వాంతులు లాంటి పరిస్థితులు తలెత్తితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

-షణ్ముగం, వ్యవసాయాధికారి, ఏర్పేడు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పురుగు మందులు పిచికారీ కోసం వాడే స్ప్రేయర్లు కండీషన్‌లో ఉన్నాయో లేదో ముందుగా చూసుకోవాలి.
- మందులు పిచికారీ చేసే సమయంలో శరీరాన్ని పూర్తిగా దుస్తులతో కప్పుకోవాలి.
- ముఖానికి మాస్కు, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి.
- పురుగు, తెగుళ్ల మందులను చేతులతో కాకుండా కర్రలతో కలపాలి.
- పిచికారీ చేసే సమయంలో పొగ, నీరు తాగడం, భోజనం చేయరాదు.
- నాజిల్స్‌ను శుభ్రపరచడానికి నోటితో గాలిని ఊదకూడదు.
- గాలి వీచే దిశలోనే మందు పిచికారీ చేయాలి.
- పురుగు మందులు వినియోగించే ముందు వాటిపై వివరాలను నిశితంగా పరిశీలించాలి. డబ్బాలపై రంగు ముద్రలను కూడా పరిశీలించాలి.
- ఆహార పదార్థాలతో పాటు క్రిమి సంహారక మందులను రవాణా చేయరాదు.
- పురుగు మందుల డబ్బాలను పిల్లలకు అందకుండా వాటిని కేటాయించిన గదిలో భద్రపరచి తాళం వేయాలి.
- కీటకనాశిని మందుల డబ్బాలు ఖాళీ అయిన వెంటనే గుంతతీసి పాతిపెట్టాలి. వాటిని ఇతర అవసరాలను వాడరాదు.
- ప్రమాదవశాత్తు మందు కళ్లల్లో పడితే వెంటనే మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్నానం చేసి దుస్తులను శుభ్రం చేసుకోవాలి.
- పిచికారీ పూర్తయిన వెంటనే స్ప్రేయర్ల ట్యాంకు లోపల, బయట శుభ్రంగా కడిగి వాటి భాగాలకు ఇంజన్ ఆయిల్ పట్టించి జాగ్రత్త పరచాలి.
- ప్రమాద వశాత్తు విష ప్రయోగానికి గురైతే చికిత్స అందించి, డాక్టర్‌ను సంప్రదించాలి. పురుగుమందుల వివరాలను డాక్టర్‌కు తెలియజేయాలి.

94 మంది ఉద్యోగాలకు ఎంపిక



నియామక పత్రాలను అందజేస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో ఉన్న అమరరాజా కర్మాగారంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన స్కిల్ ట్రెనింగ్, ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో మొత్తం 94 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. రేణిగుంట అమరరాజా కర్మాగారం ఆడిటోరియంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం పర్యవేక్షణలో జరిగిన ఇండస్ట్రీ కస్టమైసేడ్ స్కిల్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్‌కు 126 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐలో ఉత్తీర్ణులైన యువతీయువకులకు అమరరాజా గ్రూప్ కంపెనీలో మిషన్ ఆపరేటర్స్, అప్రెంటిస్ ఉద్యోగాల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 126 మందిలో 94 మంది యువతీ, యువకులను అమరరాజాలో మిషన్ ఆపరేటర్స్, అప్రెంటిషిప్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన యువతి, యువకులకు కనీస వేతనం కింద రూ.12,500 నుంచి రూ.13,500 వరకు స్టైఫండ్, ఉచిత భోజనం, ఉచిత వసతి కల్పిస్తామని అమరరాజా గ్రూపు హెచ్‌ఆర్ ప్రతినిధి వి. కళ్యాణ్ తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఏ. గణేష్, కే. మహేష్‌ల చేతుల మీదుగా అందజేశారు.

ఏర్పేడు తహసీల్దార్‌గా భార్గవి



తహసీల్దార్ భార్గవిని సన్మానిస్తున్న సిబ్బంది

ఏర్పేడు: నూతన తహసీల్దార్‌గా బుధవారం ఎం.భార్గవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఉదయ్‌భాస్కర్‌రాజు బదిలీపై కడప జిల్లాకు వెళ్లారు. నంద్యాల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న భార్గవి ఇక్కడకు బదిలీపై వచ్చారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతన తహసీల్దార్‌ను పలువురు రెవెన్యూ శాఖ అధికారులు శాలువలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో సినీ దర్శకుడు వంశీకృష్ణ



రాహుకేతు పూజలు చేయించుకుంటున్న వంశీకృష్ణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని బుధవారం సినీ దర్శకులు ఎస్ ఎస్ వంశీకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆయన్ని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో సాయిరామ్‌శంకర్ నటించిన రీసౌండ్ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో విజయవంతం కావాలని స్వామి అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు.

ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలు పరిసమాప్తం



తిరుచ్చిపై ఆండాళ్ అమ్మవారితో వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. పది రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాల్లో చివరి రోజైన బుధవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారు వేంకటేశ్వరస్వామివారితో కలిసి తిరుచ్చిపై విహరించారు. ఉదయం నిత్యపూజాకైంకర్యాలు పూర్తి చేశారు. ఆండాళ్ అమ్మవారికి అభిషేకాలు, అర్చనలను చేశారు. సాయంత్రం కల్యాణ వేంకటేశ్వరస్వామివారు, ఆండాళ్ అమ్మవారి సమేతుడై తిరుచ్చి వాహనంపై విహరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి, దూప దీప నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, అర్జితం అధికారి భరత్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు పర్యవేక్షించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో చేరిన విద్యార్థినులు బుధవారం ఫ్రెషర్స్‌డేను ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయు లు, ఘనంగా నిర్వహించారు. నూతనంగా చేరిన జూనియర్ ఇంటర్ విద్యార్థినులకు సీనియర్ ఇంటర్ విద్యార్థినులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రమణ య్య మాట్లాడుతూ ఇంటర్మీడియట్ జీవిత గమ్యా లను నిర్దేశిస్తుందని విద్యార్థినులు తమ గమ్యాన్ని చేరడానికి కృషి పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. సెల్‌ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలని, చదువుతోపాటు మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు.

అధ్వానంగా గాజులపెళ్లూరు రోడ్డు



బావిని తలపిస్తున్న రోడ్డుపై ఉన్న గుంత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉంది. దీంతో గ్రామస్తులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుచ్చినాయుడుకండ్రిగ, సూళ్లూరుపేట రోడ్డు నుంచి గాజులపెళ్లూరు గ్రామానికి కిలోమీటరు పంచాయతీరాజ్‌శాఖ రోడ్డు ఉంది. ఈ రోడ్డు గత సంవత్సరం కురిసిన భారీవర్షాలకు దెబ్బతిని, గుంతలమయమై అధ్వానంగా మారింది. వర్షం పడితే గుంతల్లోకి నీరు చేరి రొచ్చురొచ్చుగా తయారవుతోంది. రోడ్డుపై ఉన్న గుంతలు బావులను తలపిస్తున్నాయి. రోడ్డుపై గ్రామస్తులు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనాలు, కార్లు రాకపోకలు సాగించడం కష్టమవుతోంది. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా



నాగనందాపురంలో నీటి సంపులు తొలగించి కొళాయిలను ఏర్పాటు చేస్తున్న అధికారులు



నాగనందాపురంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనిత

వరదయ్యపాళెం: మండలంలోని నాగనందాపురంలో డయేరియా కేసులు తగ్గుముఖం పట్టినట్లు చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనిత తెలిపారు. బుధవారం ఒక కేసు కూడా నమోదు కాలేదని ఆమె తెలిపారు. మూడు రోజుల క్రితం డయేరియా బారినపడిన 19 మంది కూడా కోలుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. స్థానికంగా పూర్తిస్థాయిలో పరిస్థితి చక్కబడే వరకు గ్రామంలో వైద్యసేవలు కొనసాగిస్తామన్నారు. వైద్యాధికారి పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. స్థానికులు సైతం డయేరియా అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉంది. కాగా గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి గురువయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో డయేరియాకు కారణమైన పంచాయతీ నీటి సరఫరా చేసే సంపులను తొలగించి ఆ ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన కొళాయిలను ఏర్పాటు చేశారు. నీరు కలుషితం కాకుండా కట్టడి చేశారు. అంతేకాక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లి, క్రిమికీటకాల నివారణకు మందు పిచికారి చేశారు. ఎంపీడీఓ ప్రసాద్, ఈఓపీఆర్డీ చిరంజీవి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



సీనియర్ చేనేత కార్మికుడు మునిక్రిష్ణయ్యను సత్కరిస్తున్న సహచర కార్మికులు

వరదయ్యపాళెం: మండలంలోని చావాలి లింగమనాయుడుపల్లెలో జాతీయ చేనేత దినోత్సవాన్ని చేనేత కార్మికులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సీనియర్ చేనేత కార్మికులు ఎర్ర మునికృష్ణయ్యను సహచర కార్మికులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గులపల వెంకటరమణయ్య మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వృత్తి చేనేతను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. చేనేత సంఘం నాయకులు గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాలు, సహకార సంఘాల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి, చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు రేవతి, మల్లీశ్వరి, విజయభాస్కర్, చంద్రశేఖర్, మునిచంద్రయ్య, సజ్జ కిషోర్‌లు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, వైద్యాధికారి దివాకర్ తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని పీహెచ్‌సీలో ఆయన ఆశా, వైద్య సిబ్బందితో కుష్టు వ్యాధి నివారణ, వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, మెరిసే జిడ్డు గల చర్మం, బత్తాయి తొక్కలాగ ఉండడం, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కన్నురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు, చేతులు తిమ్మర్లు వంటి అనుమానిత లక్షణాలున్న ఎడల వారి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. కుష్టువ్యాధి నివారణకు ఎండీటీ మందులను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. కుష్టువ్యాధి రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా గిరిజన కాలనీలలోని గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనం తహసీల్దార్‌గా జయరాములు



నారాయణవనం: మండల తహసీల్దార్‌గా జయరాములు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల సందర్భంగా కడప జిల్లా నుంచి బదిలీపై వచ్చిన శంకరరావు సొంత జిల్లాకు వెళ్లిపోయారు. తిరుపతి కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తున్న జయరాములు నారాయణవనం తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిబ్బందితో కలిసి మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఏఎస్‌ఓ శ్రీధర్ రాజు, సిబ్బంది తహసీల్దార్ జయరాములును సత్కరించారు.

గంగమ్మకు అంబలి.. చెల్లాతమ్మకు పొంగలి



సత్యవేడు: అంబలి కుండలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న మహిళలు



సత్యవేడు: చెల్లాతమ్మకు పొంగళ్లు పెడుతున్న మహిళా భక్తులు

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేటలో బుధవారం ఉదయం తమిళ ఆడి మాస పూజల్లో భాగంగా గంగమ్మకు అంబలి పోసి, మధ్యాహ్నం గ్రామదేవత చెల్లాతమ్మ ఆలయ సమీపంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. గత ఏడాది గంగమ్మను నూతనంగా ప్రతిష్ఠించారు. వరుసగా నలభై రోజులు పూజలు నిర్వహించారు. రెండో ఏడాది కావడంతో అమ్మవారికి ఉదయం, సాయంత్రం పూజలు చేస్తున్నారు. బుధవారం గ్రామం నుంచి కిలోమీటరు దూరంలోని చెల్లాతమ్మ ఆలయం వరకు తప్పెట్లు మోగిస్తూ మహిళలు సమూహంగా వెళ్లి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకొన్నారు. ఉద్యోగ రీత్యా దూర ప్రాంతాల్లో ఉన్న వారు స్వగ్రామంలో గంగమ్మ పూజలకు హాజరు కావడంతో ఇంటింటా జన సందడి నెలకొంది. కాళమనాయుడుపేట, గాంధీపురం, దళితవాడ ప్రజలు ఐక్యంగా అమ్మవారికి పొంగళ్లు పెట్టి మత సామరస్యంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో వేపాకు తోరణాలు కట్టి, విద్యుద్దీపాలంకరణలు చేశారు. అర్ధరాత్రి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఇంటింటా కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు.

ముగిసిన శ్రీ పోలేరమ్మ జాతర

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరులోని పోలేరమ్మ దేవత జాతర బుధవారం ముగిసింది. జాతరలో భాగంగా పోలేరమ్మ దేవత విగ్రహానికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోలేరమ్మ ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు భారీసంఖ్యలో ఎదురు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. 60 సంవత్సరాల తర్వాత జాతర నిర్వహించడంతో గ్రామంలో బంధువులు, భక్తులతో గ్రామం కళకళలాడింది.



బుచ్చినాయుడుకండ్రిగ: విశేషాలంకరణలో పోలేరమ్మ

వైభవంగా పోలేరమ్మ జాతర

నాగలాపురం: గ్రామ దేవత పోలేరమ్మ జాతర బుధవారం వైభవంగా నిర్వహించారు. నాగలాపురం వెస్టులోని పోలేరమ్మ ఆలయాన్ని వేకువజామున శుద్ధి చేసి, విద్యుత్‌దీపాలు, సుగంధభరిత పుష్పాలు, వేపాకు, నిమ్మకాయల దండలతో అలంకరించారు. ఉదయం నుంచి పోలేరమ్మను దర్శించుకునేందుకు భక్తులు, మహిళలు పోటెత్తారు. మహిళలు ఆలయ ప్రాంగణలో పొంగళ్లు పెట్టి, నైవేద్యాలు సమర్పించారు,

కొంత మహిళలు, భక్తులు వేపాకు చీరతో ఆలయాన్ని ప్రదక్షిణ చేసి, పోలేరమ్మకు మొక్కును చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు జానకీరామన్ అమ్మవారిని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు. జాతరను గ్రామ పెద్దలు,ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు. అవాంచనీయ సంఘటనలకు జరగకుండా, ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ అంతారాయం లేకుండా సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డితో పాటు, నలుగురు ఎస్‌ఐలు, 50 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ఓబయ్య తెలిపారు.



నాగలాపురం: ఆలయ ప్రాంగణలో పొంగళ్లు పెడుతున్న మహిళలు

పోలేరమ్మ జాతరలో నూకతోటి రాజేష్



పూజల్లో పాల్గొన్న నూకతోటి రాజేష్

నాగలాపురం: మండల కేంద్రంలోని గ్రామ దేవత పోలేరమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం నాగలాపురం వెస్టులోని పోలేరమ్మ ఆలయానికి వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజక వర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్ నాయకులతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, శాలువ కప్పి సన్మానం చేశారు. అనంతరం ఆయనకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నదొరై సుధా, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్యామ్, వైస్ ఎంపీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు మునిరెడ్డి, ఎల్ సురేష్, దేశప్పన్, రాజ, దానివేలు, ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.